చదువు

ఈనాడు హైదరాబాద్ 10

బుధవారం మార్చి 7, 2018 ■ e-mail: edc@eenadu.in

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

షార్‌లో సైంటిస్టులు

ఇస్రోకు చెందిన శ్రీహరికోట హై ఆల్టిట్యూడ్ రేంజింగ్ (షార్)లో సైంటిస్టు ఖాళీలు.

పోస్టు-ఖాళీలు: సైంటిస్టు/ ఇంజినీర్ ఎస్‌సీ- 24, మెడికల్ ఆఫీసర్ ఎస్‌సీ/ ఎస్‌డీ: 01.

విభాగాలు: కెమికల్, క్వాలిటీ అండ్ మేనేజ్‌మెంట్, థర్మల్, మెషిన్ డిజైన్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, ఆర్థోపెడిక్స్ తదితరాలు. **అర్హత:** బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంబీబీఎస్‌తోపాటు డిప్లొమా, ఎండీ/ డీఎన్‌బీ ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

చివరితేది: 23.03.2018.

వెబ్‌సైట్: www.shar.gov.in

ప్రవేశాలు

ఏపీ ఎడ్‌సెట్ - 2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బీఎడ్ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.

దరఖాస్తు రుసుం: రూ.650.

ఆన్‌లైన్ దరఖాస్తు: 08.03.2018 నుంచి 05.04.2018 వరకు. **పరీక్ష తేది:** 19.04.2018.

వెబ్‌సైట్: sche.ap.gov.in

ఏపీ లాసెట్ - 2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి మూడు, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ, రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.

అర్హతలు: అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఇంటర్, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీకి ఏదైనా డిగ్రీ, ఎల్‌ఎల్‌ఎంకు ఎల్‌ఎల్‌బీ/బీఎల్ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.

దరఖాస్తు రుసుము: ఎల్‌ఎల్‌బీ పరీక్షకు రూ.750, ఎల్‌ఎల్‌ఎంకు రూ.850.

ఆన్‌లైన్ దరఖాస్తు: 09.03.2018 నుంచి 05.04.2018 వరకు. **పరీక్ష తేది:** 19.04.2018.

వెబ్‌సైట్: sche.ap.gov.in

ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ, ఆర్‌డీసీసెట్ - 2018

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో 2018-19 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. **అర్హతలు:** ఆర్‌జేసీ పరీక్షకు పదోతరగతి, ఆర్‌డీసీకి ఇంటర్ ద్వితీయ సంవత్సరం మార్చి 2018 పరీక్షలకు హాజరయ్యే తెలంగాణ విద్యార్థులు.

ఇంటర్ కోర్సులు: ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ. **డిగ్రీ కోర్సులు:** బీఎస్సీ, బీజెడ్‌సీ, బీఏ, బీకాం. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.

ఆన్‌లైన్ దరఖాస్తు: 08.03.2018 నుంచి 11.04.2018 వరకు.

పరీక్ష తేది: 26.04.2018.

వెబ్‌సైట్: mjptbcwreis.cgg.gov.in

నైసర్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ(ఫిజిక్స్) ప్రోగ్రాంలో ప్రవేశాలు.

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ (ఫిజికల్ సైన్సెస్/ ఫిజిక్స్), బీఈ/ బీటెక్ (ఇంజినీరింగ్ ఫిజిక్స్) ఉత్తీర్ణత. **ఎంపిక:** జామ్ 2018/ జెస్ట్ 2018, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 28.03.2018.

వెబ్‌సైట్: www.niser.ac.in

వాక్ ఇన్స్

ఐఏఆర్‌ఐ, న్యూదిల్లీ

ఐకార్- భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో కింది ఖాళీలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు.

పోస్టు-ఖాళీలు: యంగ్ ప్రొఫెషనల్- 3, ఎస్‌ఆర్‌ఎఫ్- 2.

అర్హత: ఎంఎస్సీ (మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ), నెట్/ గేట్ ఉత్తీర్ణత.

వయసు: 35 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేది: 20.03.2018.

వేదిక: మైక్రోబయాలజీ విభాగం, ఐఏఆర్‌ఐ, పూసా క్యాంపస్, న్యూదిల్లీ.

వెబ్‌సైట్: www.iari.res.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

పీజీకి అర్హత ఉందా?

➤ బీటెక్ (ఈఈఈ) పూర్తిచేశాను. జియో విభాగంలో సైన్స్ లేదా ఇంజినీరింగ్ సంబంధిత అంశాల్లో పీజీ చేయాలనుంది. నేను అర్హుడినేనా? అందించే కళాశాలలేవి?

- ఆర్. శ్రీకాంత్

జ: జియో విభాగంలో పీజీ చేయడానికి బ్యాచిలర్ డిగ్రీలో సైన్స్, ఇంజినీరింగ్, స్టాటిస్టిక్స్, జియాలజీ చదివిన వారు అర్హులు. వీరు ఎంఎస్సీ జియో ఇన్ఫర్మాటిక్స్ కోర్సును రిమోట్స్, ఎంఎస్సీ (రిమోట్స్ సెన్సింగ్ జీఐఎస్) కోర్సును ఎంచుకోవచ్చు. బీటెక్ చేసినవారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ వారు అందించే (ఐఐఆర్ఎస్) ఎంఎస్సీ- జియో ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ కోర్సును ఎంచుకోవచ్చు. ఐఐఆర్ఎస్ వారు తమ సొంత ప్రవేశపరీక్ష ద్వారా ఈ కోర్సులకు ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. టీఈఆర్ఐ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ జమ్మూ, జీవాజీ యూనివర్సిటీవారు ఎంఎస్సీ జియో ఇన్ఫర్మాటిక్స్ కోర్సులను అందిస్తున్నారు. కాబట్టి మీరు జియో విభాగంలో సైన్స్ కోర్సులు చేయడానికి అర్హులు.

ఇష్టమైన సబ్జెక్టులో లోతైన పరిశోధనలు చేసి మరింత నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి సాయపడుతోంది సీఎస్ఐఆర్ నెట్. ఆర్థిక సాయంతోపాటు ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలనూ అందిస్తోంది. ఈ పరీక్షలో నెగ్గితే జేఆర్ఎఫ్‌గా పరిశోధన రంగంలో ప్రవేశించవచ్చు. విశ్వవిద్యాలయాలూ, కళాశాలల్లో యూజీసీ గుర్తింపు పొందిన అధ్యాపకులుగా చేరే వీలుంది. సొంత ల్యాబ్‌లు పెట్టుకోవడం, రిసెర్చ్ బృందాలకు నాయకత్వం వహించడం వంటి వాటికి అవకాశం ఉంటుంది.

సీఎస్ఐఆర్

నెట్‌లో నెగ్గుదాం నేర్పుగా!

మనదేశంలో శాస్త్రీయ, సాంకేతిక మానవ వనరులను అభివృద్ధి చేస్తున్న అతిపెద్ద సంస్థ సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్). ప్రపంచంలోనే పెద్దదైన ఇండస్ట్రియల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ఇది. బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, ఇతర మౌలిక సైన్స్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థ కూడా ఇదే. దీని పరిధిలో దేశం మొత్తంలో 38 జాతీయ ప్రయోగశాలలు, 80 ఫీల్డ్ స్టేషన్లు ఉన్నాయి.

సీఎస్ఐఆర్- యూజీసీ నెట్ విభాగంలో పరీక్షలను నిర్వహించే సబ్జెక్టులు.. ■ కెమికల్ సైన్సెస్ ■ ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్, ప్లానిటరీ సైన్సెస్ ■ లైఫ్ సైన్సెస్ ■ మేథమేటికల్ సైన్సెస్ ■ ఫిజికల్ సైన్సెస్

అర్హత: ఎంఎస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో 55% మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్, ఓబీసీ విద్యార్థులూ 50% మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్‌సీ, ఎస్‌టీ, పీహెచ్ విద్యార్థులూ ఈ పరీక్షకు అర్హులు. ఎంఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ తుది సంవత్సరం చదువుతున్న వారూ అర్హులే.

పీటీవీఏ శ్రీనివాస్
డైరెక్టర్, కెంబయోసిస్ కోచింగ్ సెంటర్

జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించడానికి జనరల్ కేటగిరీ విద్యార్థులకు గరిష్ఠ వయసు పరిమితి 28 సంవత్సరాలు. ఎస్‌సీ, ఎస్‌టీ, పీహెచ్, మహిళా విద్యార్థులకు వయసులో అయిదేళ్ల సడలింపు ఉంది. నాన్ క్రీమిలేయర్ ఓబీసీ విద్యార్థులకు మూడేళ్ల సడలింపు ఉంది. లెక్చరర్‌షిప్ (ఎల్ఎస్) కు వయఃపరిమితి లేదు.

పరీక్ష ఫీజు: జనరల్ కేటగిరీకి రూ.1000, ఓబీసీ- నాన్ క్రీమిలేయర్‌కు రూ.500, ఎస్‌సీ/ ఎస్‌టీ/ పీహెచ్/ వీహెచ్ కేటగిరీకి రూ.250గా నిర్ణయించారు.

పరీక్ష విధానం

సీఎస్ఐఆర్- యూజీసీ నెట్‌లో అన్ని ప్రశ్నలూ మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. ఈ పరీక్షకు గరిష్ఠంగా 200 మార్కులు, 3 గంటల సమయాన్ని కేటాయించారు. ఈ పరీక్షలో మూడు విభాగాలు (ఎ, బి, సి) ఉంటాయి.

పార్ట్-ఎ: అందరికీ ఒకేవిధంగా ఉంటుంది. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌తో కూడిన లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ మొదలైనవాటికి సంబంధించిన 20 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా 15 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు. ఈ విభాగానికి 30 మార్కులు కేటాయించారు.

పార్ట్-బి: దీనిలో అభ్యర్థుల సంబంధిత సబ్జెక్టులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. 20 నుంచి 35 ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఈ విభాగానికి 70 మార్కులు.

పార్ట్-సి: సైంటిఫిక్ కాన్సెప్టులపై అభ్యర్థికి ఉన్న అవగాహన, పరిజ్ఞానం, అనువర్తిత ధోరణి మొదలైన అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలన్నీ అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించేలా ఉంటాయి. ఈ విభాగానికి 100 మార్కులను కేటాయించారు.

ఈ విభాగంలోని ప్రశ్నలకు ఎక్కువ వెయిటేజీ ఉంది. అందుకే సంబంధిత సిలబస్‌ను స్టాండర్డ్ రిఫరెన్స్ పుస్తకాలు, రిసెర్చ్ జర్నల్స్‌ను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి. రుణాత్మక మార్కులున్నాయి. కాబట్టి తెలిసిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలను గుర్తించాలి. వివిధ సబ్జెక్టుల్లో అడిగే ప్రశ్నల సంఖ్య, గుర్తించే సమాధానాల సంఖ్య వేరువేరుగా ఉండవచ్చు.

ఎలా తయారవ్వాలి?

లైఫ్ సైన్సెస్: బోటనీ, జువాలజీల్లో ఎంఎస్సీ చేసి, లైఫ్ సైన్స్ రాసే విద్యార్థులు ఆధునిక బయాలజీ (మాలిక్యులార్ బయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోకెమికల్ టెక్నిక్స్, బయోఫిజిక్స్, స్పెక్ట్రోస్కోపి) పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఆధునిక బయాలజీలో పీజీ చేసినవారు తమ ఆప్షనల్‌తోపాటు క్లాసికల్ బయాలజీపై, ఎకాలజీ, ఎవల్యూషన్, బయోడైవర్సిటీ మొదలైనవి చూసుకోవాలి.

కెమికల్ సైన్సెస్: కెమికల్ సైన్స్ రాసేవారు ఆర్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీలో ఎసెమిట్రిక్ సింథసిస్, కన్ఫర్మేషనల్ అనాలిసిస్, ఆర్గానిక్ స్పెక్ట్రోస్కోపి, రియేజెంట్స్, పెరిసైక్లిక్ చర్యలు, కాంతి రసాయనశాస్త్రం తదితర అంశాలనూ, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, అనలిటికల్ కెమిస్ట్రీ, బయో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కర్బన లోహ సమ్మేళనాలు, మెటల్ క్లస్టర్స్ మొదలైన అంశాలను అనువర్తిత ధోరణిలో విశ్లేషణాత్మకంగా చదవాలి.

ఫిజికల్ కెమిస్ట్రీలో క్వాంటమ్ కెమిస్ట్రీ, సాలిడ్‌స్టేట్, మాలిక్యులర్ స్పెక్ట్రోస్కోపి, స్టాటిస్టికల్ థర్మోడైనమిక్స్, కెమికల్ కైనెటిక్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ మొదలైన అంశాలను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.

ఫిజికల్ సైన్సెస్: ఫిజికల్ సైన్స్ రాసేవారు మోడరన్ ఫిజిక్స్, న్యూక్లియర్, పార్టికల్ ఫిజిక్స్, హీట్, థర్మోడైనమిక్స్ (క్లాసికల్, స్టాటిస్టికల్), ఎలక్ట్రోమాగ్నటిక్ థియరీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎక్స్‌పరిమెంటల్ మెథడ్స్, ఆప్టిక్స్, మెకానిక్స్ సబ్జెక్టులను విపులంగా చదవాలి.

మేథమేటికల్ సైన్సెస్: మేథమేటిక్స్‌లో స్టాటిస్టిక్స్, ఎక్స్‌పోలేటరీ డేటా అనాలిసిస్, కాంప్లెక్స్, డిఫరెన్షియల్ అనాలిసిస్, మ్యాట్రిక్స్, డెరివేటివ్స్, వెక్టర్, త్రికోణమితి, జామెట్రీ పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదవాలి.

రిఫరెన్స్ పుస్తకాలు

కెమిస్ట్రీ: ఆర్గానిక్ కెమిస్ట్రీ: Clayden, Carey Sundberg, William Kemp, Nasi Puri, Carruthers, Smith. ఫిజికల్ కెమిస్ట్రీ: W.Atkins, K.L.Kapoor, Mc.Quarie, Banwell ఇనార్గానిక్ కెమిస్ట్రీ: Huheey, Shriver & Atkins, Cotton & Wilkinson.

మేథ్స్: కాల్‌క్యులస్: M.J.Strauss, H.Anton రియల్ అనాలిసిస్: Shanti Narayan, Richard R Goldberg డిఫరెన్షియల్ ఈక్వేషన్స్: Sastri SS, Collins P.J. కాంప్లెక్స్ నంబర్స్: Murry R Spiegel ఆల్జీబ్రా: Bhattacharya, Devid C Lay ప్రాబబిలిటీ ఆఫ్ స్టాటిస్టిక్స్: C.E.Weatherban, Das Gupta, Ray & Sharma

ఫిజిక్స్: మెకానిక్స్: D S Mathur, Daniel వేవ్స్ అండ్ ఆప్టిక్స్: D R Brown, N K Bajaj ఎలక్ట్రిసిటీ అండ్ మాగ్నెటిజమ్: D C Tayal, Edward M Purcell క్వైనెటిక్ థియరీ అండ్ థర్మోడైనమిక్స్: D John, Charles E Hecht మోడరన్ ఫిజిక్స్: D.C. Pandey, B L Theraja సాలిడ్ స్టేట్ ఫిజిక్స్: S.P. Singh, D.K.Bhattacharya

బయాలజీ: బయోకెమిస్ట్రీ: Voet & Voet, Albert Lehninger మైక్రోబయాలజీ: Prescott సెల్ బయాలజీ: Alberts, Lodish మాలిక్యులర్ బయాలజీ: Weaver ఇమ్యునాలజీ: Kuby జెనెటిక్స్: Griffith, Suzuki యానిమల్ ఫిజియాలజీ: Nielsen ప్లాంట్ ఫిజియాలజీ: Teiz and Zeiger

సన్నద్ధత వృథా కాదు!

ఒకవేళ సీఎస్ఐఆర్‌లో జేఆర్ఎఫ్ రాకపోయినప్పటికీ మీ సన్నద్ధత వృథా కాదు. అదే సిలబస్, సన్నద్ధతతో ఇతర పోటీపరీక్షలైన ఐఐఎస్‌సీ, ఐఐటీ, టీఐఎఫ్ఆర్, జేఎన్‌సీఎస్ఐఆర్, బార్క్, హెచ్‌సీయూ, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐ, ఏపీసెట్, టీఎస్‌సెట్, డీఎల్, పేటెంట్ ఆఫీసర్, జెన్‌కో, డీఆర్‌డీఓ, ఎన్ఎఫ్ఎల్‌యూపీఎస్‌సీ, జెస్ట్, వివిధ విశ్వవిద్యాలయాల పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలు మొదలైనవాటిలో, ఇంటర్వ్యూల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే మంచి ఫలితం తప్పక వస్తుంది.

మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ఇవి http:/sirhrdg.res.in/AnswerKeys.html లో లభిస్తాయి. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌ను దేశవ్యాప్తంగా 27 కేంద్రాల్లో నిర్వహిస్తారు. మన తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు, హైదరాబాద్‌లో నిర్వహిస్తారు. సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్‌కు ఎంపికై, పరిశోధన చేసేవారికి మొదటి రెండు సంవత్సరాలు ప్రతి నెల రూ.25,000 చొప్పున స్టైపెండ్ ఇస్తారు. ఏటా రూ.20,000 చొప్పున పరిశోధన చేసే సంస్థ లేదా విశ్వవిద్యాలయం నుంచి కంటిన్‌జెంట్ గ్రాంటు కింద అభ్యర్థికి ఇస్తారు. ఆ తరువాత ఎస్ఆర్ఎఫ్ అర్హత సాధించినవారికి ప్రతి నెల రూ.28,000 చొప్పున (ఎస్ఆర్ఎఫ్ కింద) స్టైపెండ్ ఇస్తారు.

జూన్ 2018 సీఎస్ఐఆర్ పరీక్షలో జేఆర్ఎఫ్ అర్హత సాధించినవారికి జనవరి 1, 2019 నుంచి రెండేళ్ల వరకు వ్యాలిడిటీ ఉంటుంది. ఈ రెండేళ్లలో మాత్రమే ఏదైనా పరిశోధన సంస్థ లేదా విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందాలి. **వెబ్‌సైట్:** www.csirhrdg.res.in

ముఖ్యమైన తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేదీ:** 26.03.2018
- **ఈ-అడ్మిట్ కార్డులు:** జూన్ 2018 మొదటి వారం నుంచి అందుబాటులో ఉంటాయి
- **సింగిల్ ఎంసీక్యూ పరీక్ష తేదీ:** 17.06.2018

లైఫ్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, మేథమేటికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్‌ల నుంచి అభ్యర్థి ఎంచుకున్న ఒక సబ్జెక్టు ప్రకారం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు గంటల పాటు; మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.

నిట్‌ల్లో ఎంసీఏకు నిమ్‌సెట్

ఐటీ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి ఇంజినీరింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న ఇంకో కోర్సు ఎంసీఏ. ప్రోగ్రామింగ్ వృత్తిలో స్థిరపడాలన్నా, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లేదా డిజైన్‌లో భాగస్వాములు కావాలన్నా ఈ డిగ్రీ చేయవచ్చు. ఐటీ నిపుణులు కావాలన్న తమ కలను సాకారం చేసుకోవచ్చు.

రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోకి అడుగు పెట్టాలనుకునే అభ్యర్థులకు ఇంజినీరింగ్ కాకుండా ఉన్న మరో చక్కటి మార్గం ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్). దేశంలోని ప్రఖ్యాత సంస్థల్లోని ఎంసీఏ కోర్సుల్లో చేరడానికి అర్హత కల్పించేందుకు ఏటా నిమ్‌సెట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ద్వారా 11 నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)ల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో వరంగల్ ఒకటి. దేశవ్యాప్తంగా 31 జాతీయ సాంకేతిక విద్యా శిక్షణ సంస్థ (నిట్)లు ఉన్నాయి. అయితే వీటిలో 11 మాత్రమే ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. ఈ 11 సంస్థలూ ఉమ్మడి పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి ఎంసీఏ కోర్సులోకి ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ ఏడాది పరీక్షను నిట్ సూరత్‌కల్ నిర్వహిస్తోంది.

ఎంసీఏ అందిస్తోన్న నిట్‌లు: అగర్తలా, అలహాబాద్, భోపాల్, కాలికట్, దుర్గాపూర్, జంషెడ్‌పూర్, కురుక్షేత్ర, రాయ్‌పూర్, సూరత్‌కల్, తిరుచిరాపల్లి (ట్రిచీ), వరంగల్.

ఐటీ సంస్థల అవసరాల ప్రకారం ఇక్కడి ఎంసీఏ సిలబస్‌ను రూపొందిస్తారు. ఈ 11 సంస్థలూ ఒకే సిలబస్‌ను అనుసరిస్తాయి.

అర్హత: బీఎస్సీ, బీసీఏ, బీఐటీ, బీటెక్/ బీఈ వీటిలో ఏదైనా డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీలైతే 55 శాతం) ఉత్తీర్ణత సాధించాలి. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల సంఖ్య: ఎంసీఏ కోర్సు అందిస్తోన్న 11 ఎన్ఐటీల్లోనూ మొత్తం 805 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లన్నీ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన అఖిల భారత స్థాయిలో భర్తీ చేస్తారు. ఆయా నిట్‌లవారీ రాష్ట్రాల కోటా లేదు. మొత్తం 805 సీట్లలో 387 సీట్లు ఓపెన్ కేటగిరీ ద్వారా భర్తీ చేస్తారు. ఈ సీట్ల కోసం దేశవ్యాప్తంగా పరీక్షకు హాజరైన అభ్యర్థులంతా పోటీ పడవచ్చు. 209 సీట్లు ఓబీసీలకు, 114 ఎస్సీ విద్యార్థులకు, 54 సీట్లు ఎస్టీ అభ్యర్థులకు కేటాయించారు. దివ్యాంగుల కోసం 41 సీట్లు ఉన్నాయి (వీటిలో 18 సీట్లు కోసం దివ్యాంగులు అందరూ పోటీ పడవచ్చు. 9 సీట్లు ఓబీసీ, 9 సీట్లు ఎస్సీ, 5 సీట్లు ఎస్టీ దివ్యాంగులకు కేటాయించారు).

సంస్థలవారీ సీట్ల వివరాలు: అగర్తలా- 40, అలహాబాద్ - 93, భోపాల్ - 92, కాలికట్ - 46, దుర్గాపూర్ - 30, జంషెడ్‌పూర్ - 92, కురుక్షేత్ర - 60, రాయ్‌పూర్ - 92, సూరత్‌కల్ - 92, తిరుచురాపల్లి - 92, వరంగల్ - 46, కురుక్షేత్ర - 30.

పరీక్ష తేదీ: 27.05.2018 (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు)

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: వరంగల్.

ఫలితాలు: జూన్ 6న ప్రకటిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2200; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 31.03.2018 (సాయంత్రం 5 వరకు)

వెబ్‌సైట్: https://nimcet.in

ప్రశ్నపత్రం

మొత్తం 120 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. అంటే ప్రతి ప్రశ్నకు నిమిషం సమయం కేటాయించుకోవచ్చు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. సబ్జెక్టుల వారీ మ్యాథమేటిక్స్ 50 ప్రశ్నలు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40, కంప్యూటర్ అవేర్‌నెస్ 10, జనరల్ ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలడుగుతారు. ప్రతి సరైన జవాబుకు 4 మార్కులు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు.

మార్కుల వెయిటేజీ: మొత్తం మార్కులను 1000గా పరిగణిస్తారు. అంటే మ్యాథ్స్‌లో మొత్తం మార్కులకు 3 రెట్లు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ మార్కులకు ఒకటిన్నర రెట్లు, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలోని మార్కులకు 2 రెట్లు, ఇంగ్లిష్ మార్కులను యథావిధిగా ఉంచి లెక్కిస్తారు. ఈ లెక్కన మ్యాథ్స్ విభాగానికి 600 మార్కులన్నమాట. (50 ప్రశ్నలు, ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి మొత్తం 200 మార్కులు. వీటికి 3 రెట్లు అంటే 600 మార్కులు) అలాగే అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 240 (మొత్తం 40 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి 160 మార్కులు. వీటికి ఒకటిన్నర రెట్లు అంటే 160+80=240 మార్కులు), కంప్యూటర్ అవేర్‌నెస్ 80 (10 ప్రశ్నలకు 40 మార్కులు దానికి రెట్టింపు 80), ఇంగ్లిష్ విభాగానికి 80 (20 ప్రశ్నలు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి 80) మార్కులు కేటాయించారు.